సాక్షి తిరుపతి
సోమవారం । 29 । జనవరి । 2024



సమాజ హితం.. బ్రాహ్మణ సంస్కృతి

బ్రాహ్మణులు సమాజం హితం కోరుతారని, ఆధ్యాత్మికతను పంచిపెడతారని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన తెలిపారు. - 8లో



యాదవులకు అగ్ర తాంబూలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాదవులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి తెలిపారు. - 8లో



అడుగడుగునా నీరా'జనం'

పాకాల మండలంలో ఆదివారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నూతన కలెక్టర్‌గా లక్ష్మీషా



తిరుపతి అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా జి.లక్ష్మీషాను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అగ్రికల్చర్ నుంచి ఐఏఎస్ వైపు అడుగులు

కర్ణాటకలోని హోలుగుండనహళ్లి కుగ్రామానికి చెందిన జి.లక్ష్మీషా పట్టుదలతో ఐఏఎస్ స్థాయికి చేరుకున్నారు. 2013 బ్యాచ్‌కి చెందిన కర్నూల్ జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకుని కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ వచ్చింది. అనంతరం పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేశారు. తర్వాత తూర్పుగోదావరి జేసీగా విధులు నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. తాజాగా తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈయన బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేశారు. అనంతరం జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ రావడంతో ఎమ్మెస్ కోసం అలహాబాద్‌కు, పీహెచ్‌డీ కోసం ఢిల్లీ వెళ్లారు. ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ఫెలోషిప్ సంపాదించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా ప్రయాణం ప్రారంభించి.. సైకాలజీ కూడా చదివారు. అనంతరం ఆయన ఐఏఎస్‌వైపు అడుగులు వేశారు.

తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ బదిలీ

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత బదిలీ అయ్యారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా స్మార్ట్ సిటీ ఎండీ అదితీసింగ్‌ను నియమితులయ్యారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండి శిలా తోరణం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 76,104 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.92 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

రేపే టిడ్కో ఇళ్ల పంపిణీ



టిడ్కో ఇళ్లు పరిశీలిస్తున్న పసన్నకుమార్ తదితరులు

సైదాపురం (వెంకటగిరి) : వెంకటగిరిలో సుమారు వెయ్యిమందికి పైగా లబ్ధిదారులకు సోమవారం టిడ్కో ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మిళ్ల ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేయించారన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడారని తెలిపారు. టిడ్కో చీఫ్ ఇంజినీర్ మరియన్న, ఎస్ఈ జాన్స్‌సైమన్‌రావు, ఈఈ ఉమా శంకరశాస్త్రి, డీఈ రంగయ్య, ఏఈ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

31లోపు వందశాతం వ్యాక్సినేషన్



రవికుమార్, జిల్లా పశువైద్యాధికారి

తిరుపతి అర్బన్ : పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ముందుస్తుగా చేపట్టిన వ్యాక్సినేషన్‌ను ఈ నెల 31వ తేదీలోపు వందశాతం పూర్తి చేస్తామని జిల్లా పశువైద్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,64,800 టీకాలను వేయాలని టార్గెట్ పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 92శాతం పూర్తి చేశామని వివరించారు. ఈ నాలుగేళ్లలో 31 పర్యాయాలు పశువులకు ముందస్తు టీకాలు వేశామని చెప్పారు. తాజాగా 32వ విడత చేపట్టినట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే పాడి రైతులు వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 3ఏళ్లకు ఒక్కసారి రూ.386 చెల్లిస్తే రూ.30వేల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. వైఎస్సార్ పశువైద్య సంచార వాహనాల ద్వారా సేవలను పొందడానికి 1962కు కాల్ చేస్తే మీ ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పశువులకు చికిత్సలందిస్తారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన పెంపొందించుకుని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల: టీటీడీ బోర్డు సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్‌లో ప్రారంభం కానుంది. ఈ సమావేశానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షత వహించనున్నారు. పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదించనున్నారు.

జన చైతన్యయాత్ర



ర్యాలీగా వస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మేరిగ మురళీధర్, ఇతర నేతలు



సాధికార యాత్ర సభకు హాజరైన అశేష ప్రజానీకంలో ఓ భాగం

నేతల ప్రసంగాలకు స్పందన

ప్రజలతో మమేకం కావాలి.. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలి.. సంక్షేమ ఫలాల లబ్ధిని తెలియజేయాలి.. రాబోయే ఎన్నికల సంగ్రామంలో జనం సరైన మార్గంలో పయనించేలా దిశానిర్దేశం చేయాలి.. సుపరిపాలనకు అండగా నిలిచేలా చైతన్య పరచాలి.. ఇదే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆదివారం గూడూరు నియోజకవర్గం కోటలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రజానీకం పోటెత్తింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు జైకొట్టింది.

- కోటలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- 20 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ
- సంక్షేమ పాలనకు జైకొట్టిన ప్రజలు
- నేతలకు అపూర్వ స్వాగతం

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలోని కోటలో ఆదివారం సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ఈ మేరకు చిల్లకూరు మండలం బూదనం నుంచి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు ర్యాలీగా బయలుదేరారు. సుమారు 20 కిలోమీటర్ల కొనసాగిన ర్యాలీకి కోట పట్టణంలోని గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద భారీ ఎత్తున స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి గజమాలతో సత్కరించారు. స్థానిక వినాయక స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో దువా చేపట్టారు. ఈ క్రమంలో సభా ప్రాంగణానికి బయలుదేరిన నేతలకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా వేదికపై అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, జ్యోతిరావ్ పూలే, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక సాధికారత వెల్లివిరుస్తోందని వెల్లడించారు.



ఫ్లకార్డులతో మహిళలు, విద్యార్థుల ఆత్మీయ ఆహ్వానం



గజమాలతో స్వాగతం

నమ్మకాన్ని వమ్ము చేయను

వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు ఔరంగ్‌జేబులా ప్రవర్తిస్తున్నారని, కుటుంబాలలో చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మేలు జరిగి ఉంటేనే ఓటేయమని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరు మేయర్ స్రవంతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, సీఈసీ సభ్యులు ధనుంజయరెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, వీరిచలపతి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, నేదురుమల్లి ఉదయశేఖర్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచేలా..

గూడూరు రూరల్: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా ఆదివారం చిల్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నా ఎస్సీ,నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాజకీయ,ఆర్థిక సమానత్వం రావాలంటే చదువు ఎంతో ముఖ్యమని గుర్తించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తూనే ఇంగ్లిష్ మీడియాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ఎంపీ బీదమస్తాన్‌రావు మాట్లాడుతూ టీడీపీలో ఏనాడు ఎస్సీ,ఎస్టీ,బీసీలకు న్యాయం జరగలేదన్నారు.యాదవ సామాజిక వర్గానికి చెందిన తనను రాజ్యసభకు ఎంపిక చేసి సామాజిక సాధికారతకు జగనన్న నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. మైనారిటీ నేత ఖాదర్‌బాషా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు 500 ఎకరాలు అందించిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఇమామ్‌కు రూ.5వేల గౌరవ వేతనం అందించడం ఎందరికో మేలు చేస్తోందని తెలిపారు.



ఉప్పొంగిన ఉత్సాహంతో పుష్పాభిషేకం



కదంతొక్కుతూ బైక్ ర్యాలీ



నృత్యాలతో సంబరం



మేరిగను పరిచయం చేస్తున్న విజయసాయిరెడ్డి

చరిత్ర సృష్టించేలా గృహాల నిర్మాణం



పుంగనూరు: ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

- రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాకు అగ్రస్థానం
- కృష్ణాజలాలతో కుప్పం రైతులను ఆదుకున్నాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా గృహనిర్మాణాలు చేపట్టి చరిత్ర సృష్టించామని, అందులో రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా ప్రథమస్థానం దక్కించుకుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం పుంగనూరు పట్టణంలో పేదలకు ఇంటి స్థలాలను చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇంటి పట్టాలు అందించామని, అందులో రూ.22 లక్షల ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. 16 లక్షల ఇళ్లు త్వరలోనే పూర్తి కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 16 వేల ఇళ్లు మంజూరు చేయగా, 10 వేల ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. పట్టణంలో నాలుగు జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, 1,186 మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని, ప్రస్తుతం 426 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు కనీసం కుప్పంలో కూడా పక్కా ఇళ్లు నిర్మించలేదని ఆరోపించారు. కుప్పానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను విడుదల చేసి రైతులను ఆదుకున్నామని వివరించారు.

బాబుకు ఓటేస్తే అభివృద్ధి విఘాతమే..

14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కుప్పం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రతిసారీ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజలు గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సర్కారు పనితీరును పరిశీలించాలని కోరారు. చంద్రబాబు మాటలు నమ్మితే మన కాళ్లను మనం నరుక్కోవడమే కాకుండా అభివృద్ధికి విఘాతం కలిగించినవారవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను అమలు చేసిన జగనన్న

ఎన్నికల పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టిన హామీలను 99 శాతం అమలు చేశారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. అర్హులైన పేదలందరికీ నవరత్నాలు, రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, 104ల ద్వారా వైద్య సేవలు అందించడం చరిత్రలో నిలిచిపోతాయని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు.

ఆదిమూలం అన్నా.. ఒక్క దళితుడికైనా మంచి చేశావా?

- సాటి దళితులను ఏనాడైనా గౌరవించావా?
- దళిత మహిళకు పదవి ఇవ్వొద్దని అడ్డుకున్నావా.. లేదా?
- ప్రమాణస్వీకారానికి రమ్మని మీ కాళ్లుపట్టుకుని వేడుకోలేదా?
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై స్థానిక నేతల ఆగ్రహం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, నేతలు

సాక్షి, తిరుపతి: 'ఆదిమూలం అన్నా.. దళిత జాతికి చెందిన నీవు ఒక్క దళితుడికైనా మంచి చేశావా? టీడీపీలో టికెట్ ఇవ్వలేదనే కదా.. నాడు వైఎస్సార్‌సీపీలో చేరావు?. ఎమ్మెల్యే అయ్యాక సాటి దళితులను ఏనాడైనా గౌరవంగా చూశావా?' అంటూ సత్యవేడు నియోజకవర్గ దళిత నేతలు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం సోషల్ మీడియా వేదికగా వైఎస్సార్‌సీపీ నేతలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన కోడలు సంధ్యారాణికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవం ఇచ్చారని బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన దళిత నాయకుడు గురునాథం గుర్తుచేశారు. తన కోడలికి పదవి ఇవ్వడం ఎమ్మెల్యే ఆదిమూలంకి ఇష్టం లేదని, చైర్మన్ పదవిని రద్దు చేయించేందుకు చాలా కుట్రలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాణస్వీకారానికి రావాలని నెల రోజులపాటు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి కాళ్లుపట్టుకుని వేడుకున్నా రాలేదని ఆయన వాపోయారు. ప్రమాణస్వీకారానికి రాకపోగా.. తన కోడలు చైర్మన్‌గా ఉన్న శాఖలో నాలుగు ఉద్యోగాలను ఎమ్మెల్యే అమ్మి సొమ్ముచేసుకున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే అయ్యాక ఏ రోజైనా సాటి దళితుడిని గౌరవించావా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అయ్యాక ఒక్క దళితుడి ఇంటికి వెళ్లి కూర్చున్నావా?. కష్టం ఉంటే ఏ రోజైనా ఒక్కడినైనా ఓదార్చావా? అని గురునాథం, ఎంపీటీసీ గురవయ్య తదితరులు ఎమ్మెల్యే ఆదిమూలం తీరుపై విరుచుకుపడ్డారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ఆదిమూలం కనుసన్నల్లోనే గ్రావెల్, ఇసుక, మట్టి తవ్వకాలు జరిగాయని తెలిపారు. మీ అనుమతులు లేకుండానే చేస్తున్నారన్నది అవాస్తవం అన్నారు.

కష్టపడి గెలిపించుకుంటే చేసేది ఇదా?

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిమూలంకి రెండు సార్లు టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఓ సారి ఓడిపోతే.. రెండోసారి మేమంతా కలిసి పనిచేసి గెలిపించుకున్నాం అన్నారు. డబ్బులు లేవంటే.. తాను పలువురి వద్ద కోటి రూపాయలు డొనేషన్ల రూపంలో వసూళ్లు చేసి ఇచ్చిన విషయాన్ని ఎంపీటీసీ గురవయ్య గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా గెలిచాక మాలో ఒక్కరినైనా పలకరించావా? టీడీపీ నాయకులతో కుమ్మక్కై మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదా? అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే పెద్దాయన అయినటువంటి మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సాటి ఎస్సీ అయిన ఎమ్మెల్యే ఆదిమూలం మమ్మల్ని ఎన్నో సార్లు అవమానించారని, కనీసం దగ్గరక్కూడా చేర్చుకోకుండా దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలోకి వెళ్లడానికే ఆదిమూలం డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు మానుకుని, చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదు

సత్యవేడు: మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు లేదని మాజీ ఎమ్మెల్యే సురాజ్ తెలిపారు. సత్యవేడులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో దళితులకు పెద్ద దిక్కుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని, సత్యవేడు నియోజకవర్గంలో అన్నివర్గాల నాయకులకు అండగా ఉండే నాయకుడు పెద్దిరెడ్డే అన్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు చేయడం, దళిత ద్రోహి అంటూ విమర్శలు చేయడం ఆదిమూలం స్థాయికి తగదన్నారు. ఆదిమూలం నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో సత్యవేడు టిక్కెట్టు తనకు వచ్చేదని, అప్పుడు పెద్దిరెడ్డి చొవరతో ఆదిమూలంకు టిక్కెట్టు దక్కిందన్నారు. పెద్దిరెడ్డి ఆశీసులు ఉండబట్టే 2019 ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరిందని తెలిపారు. అప్పుడు దళితుల ఆపద్బాంధవుడు పెద్దిరెడ్డి, ఆయన వల్లే గెలిచాను అని, ఇప్పుడు ఇలా మాట్లాడడం సబబు కాదన్నారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి ఉన్నారని, ఆయన్ను అడగాల్సింది పోయి పెద్దిరెడ్డిని దూషించడం తగదన్నారు. సత్యవేడు నియోజవర్గంలో మంత్రి సిఫార్సుమీదే 33 రోడ్డు పనులు మంజూరయ్యాయని, స్థానిక ఎమ్మెల్యేగా 15 శాతం వాటా కోరడం వల్లే పనులు జాప్యమయ్యాయని తెలిపారు. ఆయన వెంట నేతలు బుజ్జిరెడ్డి, మునిరత్నం, రవిరెడ్డి, వీరరాఘవరెడ్డి, జయచంద్రారెడ్డి, విక్రమార్కరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

1 నుంచి టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్


చీర్ల కిరణ్

తిరుపతి(అలిపిరి): వడమాలపేట మండలం పాదిరేడు వద్ద 432 ఎకరాల్లో 5,521 మంది టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాలకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నారు. ఆదివారం ఈ మేరకు టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. కేటాయించిన 50 అంకణాల ఖరీదు రూ.2,99483లను వెంటనే కట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే రూ.24,650 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ క్రమంలో మొత్తం రూ.3,24,133లను వెల్ఫేర్ ఆఫీస్‌లో చలానా వేసుకుని ఎస్బీఐలో కట్టాలని పేర్కొన్నారు. ఇంటి స్థలాలకు సంబంధించిన దస్తావేజులు మొత్తం టీటీడీ పరిపాలనా భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న వెల్ఫేర్ కార్యాలయంలో తయారు చేస్తారని వివరించారు. ఇంటి స్థలం పొందిన ఉద్యోగి దస్తావేజులు తీసుకొని ఎమ్మార్‌పల్లె పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పెత్తందార్లపై యుద్ధం..‘మేము సిద్ధం’


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

నాయుడుపేట : పేదలకు సంక్షేమ పథకాలను అందకుండా అడ్డుకునేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్న పెత్తందార్లపై యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేము సిద్ధం పోస్టర్ విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెత్తందార్లపై పోరులో పేదలే విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తుంటే ఓర్వలేక టీడీపీ, జనసేన కుతంత్రాలకు తెగబడుతున్నాయని విమర్శించారు. మేలు జరిగి ఉంటేనే ఆశీర్వదించండి అని చెప్పిన దమ్మున్న ముఖ్యమంత్రి దేశంలోనే లేరని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను దగా చేసిన చంద్రబాబునాయుడు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు జనసేన, కాంగ్రెస్ జెండాలన తోడు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాల కుట్రలను భగ్నం చేసేందుకు మేము సైతం సిద్ధం అంటూ ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. తప్పుడు పనులు చేసిన చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులతోపాటు ఇతర వర్గాలను సైతం నట్టేట ముంచిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్పర్సన్ కటకం దీపిక, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఓట్టూరు రాధాకిషోర్ యాదవ్, ఈద రత్నశ్రీ, చదలవాడ కుమార్, గంధవల్లి సిద్ధయ్య, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కె.రామకృష్ణమరాజు, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

8 నుంచి ఆరాధనా మహోత్సవాలు

తిరుమల: కర్ణాటక సంగీత పితామహుడు పురంధర దాసుల ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహించనున్నారు. చివరిరోజు ఫిబ్రవరి 10న ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే ఫిబ్రవరి 7న తిరుమలలోని కల్యాణవేదికలో యువ కళాకారులతో ‘శ్రీ వేంకటేశ్వర నవరత్న మాలిక’ గోష్టిగానం నిర్వహించనున్నారు.

కళాకారులకు ‘యువ ప్రతిభ పురస్కారాలు’

సంగీత, నృత్య, వాద్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ఈ ఏడాది మొదటిసారిగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ‘యువ ప్రతిభ పురస్కారాలు’ అందజేయనున్నారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

సమాజ హితం.. బ్రాహ్మణ సంస్కృతి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్ : బ్రాహ్మణ సంస్కృతి ఎల్లప్పుడూ సమాజ హితం కోరుతుందని, పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే బ్రాహ్మణులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉందని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని శ్రీకంచి పాదుకా మండపంలో నిర్వహించిన అఖిల భారత 32వ బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా బ్రాహ్మణ వధూవరుల వివాహ వేదిక నిర్వహించడం అభినందనీయమన్నారు. నేడు కనుమరగవుతున్న విలువల నేపథ్యంలో సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సంస్కృతిని కాపాడుతున్న సీఆర్‌కే శేషగిరిరావు ప్రశంసనీయులని కొనియాడారు. సనాతన ధర్మం, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ తాత్వికత గుణంతో బ్రాహ్మణ కుటుంబీలకు ఆదరించడం సంతోషకరమన్నారు. అనంతరం సామూహిక షష్టిపూర్తి జరుపుకుంటున్న వృద్ధ బ్రాహ్మణ దంపతులను అక్షింతలతో ఆశీర్వదించారు. నిర్వాహకుడు శేషగిరిరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 32 వివాహ పరిచయ వేదికలు నిర్వహించామని, వేలాది మంది బ్రాహ్మణ యువతీ యువకులకు వివాహాలు జరిపించామని వివరించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి హాజరై ఆశీస్సులు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.

అనంతరం సుమారు 20 మందికి శాస్త్రోక్తంగా షష్టిపూర్తి నిర్వహించారు. వృద్ధ దంపతులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్లు అందజేశారు. అలాగే భీమరథ శాంతి, సహస్ర చంద్రదర్శనం, శాంతి హోమం జరిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, బ్రాహ్మణ ఓపెన్ ఫోరం చైర్మన్ రమణమూర్తి, ఎఫ్‌ఓబీఎంఎస్ వైస్ చైర్మన్ ఏఎల్‌ఎన్ శాస్త్రి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రామమూర్తి, వై.సూర్యనారాయణ, కిరణ్‌కుమార్, వేదిక్ వర్సిటీ ప్రొఫెసర్ సుబ్రమణ్యం, చిత్రపు హనుమంతరావు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ద్రాక్షాయిణి, అర్చకుడు జోసుల రామకృష్ణ పాల్గొన్నారు.

అడుగడుగునా నీరా‘జనం’


అశేష జనసందోహం నడుమ ముందుకు సాగుతున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి


టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అడుగడుగునా ప్రజలు నీరాజనం పట్టారు. ఆదివారం మండలంలోని పంటపల్లె, సామిరెడ్డిపల్లె, చెన్నుగారిపల్లె, ఉప్పరపల్లె పంచాయతీల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మేలు జరిగి ఉంటేనే ఓటేయమని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని వెల్లడించారు. ప్రజాసేవే పరమావధిగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిత్యం శ్రమిస్తుంటారని, ఆయన బాటలోనే తానూ ముందుకు సాగుతానని తెలిపారు. కోవిడ్ సమయంలో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో సైతం ఎమ్మెల్యే చెవిరెడ్డి అహర్నిశలు ప్రజాసేవకే పరితపించారన్నారు. పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారని గుర్తుచేశారు. అలాగే నియోజకవర్గంలో వధూవరులకు పెళ్లికానుక, తోఫాలను సొంత నిధులతో అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా ఎక్కడైనా కావాల్సివస్తే పంచాయతీకి రూ.కోటి చొప్పున అందిస్తామని వెల్లడించారు. నిత్యం ప్రజాసేవలో ఉండే తమను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ జయదేవ్ నాయుడు, పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఖాజామస్తాన్, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, భాస్కర్‌నాయుడు, సర్పంచులు సుబ్రమణ్యం, కళావతి, గౌరీశంకర్‌రాజు, జగన్నాథరెడ్డి, పవన్‌కుమార్, రమేష్, ఎంపీటీసీ సభ్యుడు సురేష్, శివ, బాను, చంటి, మునిరత్నంరెడ్డి, బాబురెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

మండలంలోని పంటపల్లెలో నేంద్రగుంటకు చెందిన టీడీపీ నేతలు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ యువజన విభాగానికి చెందిన నలిపినేని ఉదయ్‌చౌదరి, బోయపాటి నితిన్‌చౌదరి తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి మోహిత్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మోహిత్‌రెడ్డి గెలుపునకు అలుపెరగకుండా, కష్టపడి పని చేస్తామని తెలిపారు.

యాదవులకు అగ్ర తాంబూలం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో యాదవులకు అగ్ర తాంబూలం దక్కిందని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి లీలామహల్ సర్కిల్ వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యాదవులు, కురబల ఆత్మీయ సమ్మేళనానికి మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితోపాటు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తమ కుటుంబంలో కులమతాలకు తావులేదన్నారు. సమాజానికి, సమూహానికి మేలు చేసే తత్వం తమదని స్పష్టం చేశారు. తిరుపతిలో యాదవులకు విశేష గౌరవం దక్కిందని తెలిపారు. యాదవ కులానికి చెందిన డాక్టర్ శిరీషకు మేయర్, కట్టా గోపీయాదవ్‌కు గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవులు కట్టబెట్టామని, అలాగే 9 మంది కార్పొరేటర్లు, వివిధ ఆలయ కమిటీ చైర్మన్ల పదవులకు కల్పించిన ఘనత జగనన్నదే అని వివరించారు. సుమారు 800 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన యాదవరాజుల పేర్లు చిరస్థాయిగా నిలిచేలా తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లకు పెట్టామని వెల్లడించారు. యాదవుల ఆకాంక్షల మేరకు శరబయ్య విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. తనది ఫైటింగ్ రాజకీయమైతే, అభినయ్‌ది ఆలోచనతో కూడిన రాజకీయమన్నారు. తిరుపతి అభివృద్ధి పూర్తిగా అభినయ్ ఆలోచనల ఫలితమే అని స్పష్టం చేశారు. తిరునగరి ఖ్యాతిని ఇనుమడింపజేసేలా అభివృద్ధి చేస్తున్న అభినయ్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మేయర్ శిరీష మాట్లాడుతూ తిరుపతిలో ఉన్నత పదవుల్లో అధిక భాగం యాదవులకు కల్పించిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో భూమన కుటుంబానికి యాదవులంతా అండగా నిలబడి అభినయ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ లాగా కార్యకర్తలను వాడుకుని వదిలేసే పార్టీ వైఎస్సార్‌సీపీ కాదన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తే తన రాజకీయ ఎదుగుదలకు అవరోధమై, కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడిలా పద్మవ్యూహంలో చిక్కుకుంటావని చాలా మంది హెచ్చరించారని చెప్పారు. అయితే తాను అర్జునుడిలా బయట పడేందుకు, రథసారథిలా మేయర్ శిరీషక్క సహకారం అందించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిభ–ఆలోచనలే ప్రాతిపదికగా గుర్తించి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. సమావేశంలో గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, కార్పొరేటర్లు కల్పనాయాదవ్, రత్నకుమారి, కుడితి సుబ్రమణ్యం, అన్నా సంధ్య, అన్నా అనిత, యాదవ, కురబ నాయకులు ఆవుల ప్రభాకర్, బుసగాని లక్ష్మయ్య, కృష్ణచైతన్యయాదవ్, శరత్‌యాదవ్, గంగాధరయాదవ్, చిన్నియాదవ్, భరణియాదవ్, పెరుగుబాబూయాదవ్, చింతారమేష్‌యాదవ్, గీతాయాదవ్, అరుణ్‌యాదవ్, బత్తినబాబు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

సైదాపురం : స్థానిక సిద్దలయ్యకోన సమీపంలో ఆదివారం టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. జార్ఖండ్‌కు చెందిన బ్యేయస్‌కుమార్ (17) అనే యువకుడు ఓ మైన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి టీ తాగేందుకు సైదాపురం వస్తుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడి అన్న సీతారామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త

– కత్తి దాడిలో మరో మహిళకు గాయాలు


దొరసానమ్మ మృతదేహం | గాయపడిన మంజుల


నిందితుడు శివ (ఫైల్)

ఓజిలి : మండలంలోని వీర్లగున పాడు ఎస్సీ కాలనీలో దొరసానమ్మ(35) అనే మహిళను ఆమె భర్త శివ ఆదివారం కత్తితో నరికి చంపేశాడు. వివరాలు.. కాలనీలో నివసించే శివ, దొరసానమ్మ దంపతులు మరో మహిళ మంజులతో కలిసి అడవిలో కట్టెలు కొట్టేందుకు వెళ్లారు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ శివ కత్తితో ముందుగా మంజులపై దాడి చేశాడు. అనంతరం దొరసానమ్మను విచక్షణారహితంగా నరికేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. మంజుల తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. అటువైపు వచ్చిన పశువుల కాపరులు ఈ విషయాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు హుటా హుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంజులను 108లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ జగన్‌మోహన్‌రావు, ఇన్‌చార్జి ఎస్ఐ తిరుమలరావు ఘటనాస్థలానికి చేరుకుని దొరసానమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య ఎందుకు జరిగిందన్న కోణంలో గ్రామస్తులు నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం

నేడు జిల్లాకు ప్రిన్సిపల్ సెక్రటరీ

తిరుపతి అర్బన్ : రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి సోమవారం తిరుపతికి రానున్నారు. ఉదయం తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతి నగరంలోని అలిపిరి రోడ్డు మార్గంలో ఉన్న మూడు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం వేకువజాము గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు గోవిందమాల భక్తులు మృతి చెందారు. ఎస్ఐ పరమేశ్‌నాయక్ కథనం.. తమిళనాడు కాంచీపురం జిల్లా, కట్రంబాకంకు చెందిన మోహన్(45), వరదన్(42) కాలినడకన తిరుమలకు బయలుదేరారు. శనివారం రాత్రి అరణ్యంకండ్రిగ వద్ద బసచేశారు. ఆదివారం వేకువజామునరాళ్లకాలువ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వరదన్‌కు తీవ్ర గాయాలు కావడంతో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ వరదన్ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు


నేటి బడి–మార్పుల బడి పుస్తకావిష్కరణలో మునిశారద

ఏర్పేడు : విద్యా విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మద్దిల ముని శారద తెలిపారు. ఆదివారం ఏర్పేడు శివ పబ్లిక్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కాపిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నేటి బడి–మార్పుల బడి అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నేటి బడి–మార్పుల బడి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రభుత్వం సమ సమాజనిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని పేద విద్యార్థులకు అందించేందుకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. సీబీఎస్‌ఈ సిలబస్ పాఠ్యాంశాలతో ఆంగ్ల మాధ్యమంలో బోధన ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించారని వెల్లడించారు. . అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, గోరుముద్ద పథకాల ద్వారా పేద విద్యార్థులకు అండగా జగనన్న నిలుస్తున్నారని వివరించారు. మరింత అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, మహేష్, నరేష్, జానకిరాముడు, వెంకటముని, సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో సైబర్ క్రైమ్ నియంత్రణపై సదస్సు

తిరుపతి సిటీ : ఎస్వీయూ సెనెట్ హాల్‌లో సోమవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీబీడీ రీజనల్ ఆఫీసర్, డీఎస్పీ ఏ.పద్మలత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సెక్యూరిటీ పరిజ్ఞానంపై పోలీసులు, బ్యాంకు ఉద్యోగులు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

పంటలపై ఏనుగుల దాడి

భాకరాపేట : మండలంలోని భీమవరం సమీపంలో ఉన్న పంటలపై శనివారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. దిగవూరు పంచాయతీ శాంతి నగర్, గాండ్లపల్లె గ్రామాలకు చెందిన రైతులు రమేష్, కుమార్, వేణు, లక్ష్మయ్య, ఈశ్వరయ్య, మధు చెందిన వరి పైర్లను నాశనం చేశాయి. ఈ మేరకు ఆదివారం సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఏనుగుల కట్టడికి చర్యలు చేపడతామని ఫారెస్ట్ అధికారి దత్తాత్రేయ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ‘స్పందన’

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతుల రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘అప్సా’ జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను ఆదివారం తిరుపతిలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నికల్లో పలు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా లెక్కల రమేష్, కార్యదర్శిగా పగడాల లోకేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గంగయ్య, కోశాధికారిగా అనిల్, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

‘తెలుగు సినిమాభక్తి పాటలు’ పుస్కకావిష్కణ


భక్తి పాటల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ సెనెట్‌హాల్‌లో ఆదివారం టీటీడీ కల్యాణోత్సవ స్పెషల్ ఆఫీసర్ ఆచార్య ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి రచించిన తెలుగు సినిమా భక్తిపాటలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సినిమా భక్తిపాటల్లో ఎంతో సాహిత్యముందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి రచించిన పుస్తకాలు విశేష ప్రజాదరణ పొందాయని కొనియాడారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, ఆచార్య పేట శ్రీనివాసులు, పాపారావు, ఎస్వీయూ పాలకమండలి సభ్యులు భూమన సుగుణారెడ్డి, పి.నరసింహారెడ్డి, ఆర్.రాజేశ్వరమ్మ, కె.మునిరత్నం, ఆదినారాయణరెడ్డి, భూమన జనార్ధనరెడ్డి, రాకేష్, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.